క్లుప్తంగా

ప్రాణాలు తీస్తున్న గుడుంబా

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులో హానికరమైన గుడుంబా ప్రజల ప్రాణాలను తీస్తోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అబ్కారీ అధికారులు గుడుంబా తయారీ, విక్రయాలపై కఠినచర్యలు తీసుకోకుండా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా గుడుంబా విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాముళ్ల మత్తులో జోగుతున్నారని అన్నారు. హానికరమైన గుడుంబాతో చిన్నవయసులోనే అనేకమంది యువకులు అనారోగ్యంతో ప్రాణాలు కొల్పోతున్నారని, ఇప్పటికైనా అబ్కారీ అధికారులు దాడులు నిర్వహించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

గుండాల: ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా యువత పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్శిక రవి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం పీవైఎల్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మనువాద, ఫాసిజం రోజురోజుకూ పెరిగిపోతోందని, వీటికి వ్యతిరేకంగా షాద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతిని గ్రామ గ్రామానా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నాడని అన్నారు. ఆయా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు అటికం శేఖర్, ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, మండల నాయకులు తాటి కృష్ణ, లాజర్, ప్రసాద్, రమేష్, ప్రభాకర్, రామారావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులోనే ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ కేంద్రమైన మణుగూరు మండలంలోనే ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్మించాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మణుగూరు కేంద్రంగా మంజూరైన పాలిటెక్నిక్, ట్రైబల్ రెసిడెన్షియల్ కళాశాలలను అశ్వాపురం మండలానికి తరలించడం సరికాదన్నారు. ఆయా కళాశాలలతో పాటు ఎస్సీ, బీసీ గురుకుల కళాశాలలను మణుగూరులోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణుగూరులో అపారమైన భూవనరులు ఉన్నాయని, వాటిని వినియోగించి ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు కొడిశాల రాములు, టీవీఎంవీ ప్రసాద్, నరసింహరావు, పద్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ భూమి వివాదంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేటకు చెందిన రామిశెట్టి సుబ్బారావుకు స్థానిక దొంతికుంటకు చెందిన బాణాల నారాయణ అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం రెండు ఎకరాల వ్యవసాయ భూమిను విక్రయించాడు. కొనుగోలు చేసిన సుబ్బారావు దానిలో జామాయిల్ సాగు చేశారు. ఇంతలోనే నారాయణ పొలంలో ఉన్న జామాయిల్ మొక్కలను నరికించాడు. అందేంటని ప్రశ్నిస్తే.. తాను భూమి అమ్మలేదని, కౌలుకు మాత్రమే ఇచ్చానని అడ్డం తిరిగాడు. ఈ మేరకు బాధితుడు సుబ్బారావు చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో నారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

దుమ్ముగూడెం: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో మండల వ్యాప్తంగా రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపూడి రమేష్, మండల అధ్యక్షుడు సత్యనారాయణలు డిమాండ్ చేశారు. శుక్రవారం విడుదల చేసిన వేరువేరు ప్రకటనలలో వారు మాట్లాడుతూ.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా ఎండిన మిర్చి రాశుల చుట్టూ వరద చేరిందని, దీనివల్ల మిర్చి రంగు మారి ధర తగ్గే ప్రమాదం ఉందని అన్నారు. కోసిన మిర్చి నీటిలో ఉంటే మరోవైపు ఎండ లేకపోవడం బరకాలు కప్పడం వలన బూజు పట్టే అవకాశం ఉందని అన్నారు. మరోవైపు వర్షం సుంక్ దశలో ఉన్న వరిపైనా తీవ్ర ప్రభావం చూపుతూ.. దిగుబడి తగ్గడానికి దారితీస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తారు. మండల వ్యాప్తంగా ఎక్కువగా వరి, మిర్చి పంటలనే సాగు చేసిన నేపథ్యంలో ఆయా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కార్మికుల వేతన వెతలు

- కనీస వేతనాలకు నోచుకోని మున్సిపల్ వర్కర్లు
- నెలలు గడవనిదే అందని జీతం
- ఎన్ని జీఓలొచ్చినా ఫలితం శూన్యం



మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీలో నిత్యం పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నారు. మున్సిపాలిటీలోని మురికిని నిత్యం శుభ్రం చేస్తున్న ఆ కుటుంబాల్లో కనీస వెలుగులు నిండటం లేదు. పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడుతున్న వీరి ఆకలి తీర్చే వారు లేరు.

ప్రస్తుతం ప్రభుత్వ జీఓల ప్రకారం మున్సిపాలిటీ కార్మికులకు కనీసం వేతనంగా రూ.15వేల 600లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ.. కేవలం రూ.12వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. మణుగూరు మున్సిపాలిటీలో సుమారు 60 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ఎంతో కాలంగా పనిచేస్తున్న వీరికి కనీస వేతనాలు అమలు చేయడంలో అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని రకాల జీఓలు తీసుకొచ్చినా మణుగూరు మున్సిపల్ కార్మికులకు మాత్రం అమలు కావడంలేదు. దీంతో మున్సిపాలిటీలో కార్మికులు పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. వయోవృద్ధులకు ఎంతో కొంత ఇచ్చి పనులు చేయించుకుంటూ కాంట్రాక్టర్లు కాలం వెళ్లబుచ్చుతున్నారు.

ఆరు నెలలు వేచి చూడాల్సిందే..

మణుగూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న సుమారు 60 మంది కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు అందక పోవడంతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమ్మె చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలీచాలని వేతనాల కోసం ఆరునెలల వరకు వేచిచూడాల్సిన దుస్థితిలో కార్మికులు కాలం వెల్లబుచ్చుతున్నారు. అసలే కనీస వేతనాలు ఉండవు. ఇచ్చే కొద్దిగొప్ప వేతనాలు సైతం సకాలంలో రాకపోవడంతో ఆ కుటుంబాలు పడుతున్న అవస్థలు అంతా ఇంతా కాదు. ప్రతినెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని వారు ఘంటాపదంగా డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈఎస్సై, పీఎఫ్‌లతోపాటు కనీసం సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. కార్మికులకు పనిచేసే సమయంలో రక్షణ పనిముట్లు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంతో కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



వేతనాలు సకాలంలో అందించకవడంతో మున్సిపాలిటీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ కుటుంబాలు దీన స్థితిలో ఉంటున్నాయి. నిత్యం పనిచేసే కార్మికులు నెల రాగానే అప్పులు తీసుకుని కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓల ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎండీ గౌస్, ఇఫ్టూ నేత, మణుగూరు

రెగ్యులర్ చేయాలి



ఎంతో కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలి. చాలీచాలని వేతనాలతో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ప్రతి నెలా 1న వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పెంచిన వేతనాలు వెంటనే అమలు చేయాలి. కాంట్రాక్టు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు రక్షణ పరికరాలు ఏర్పాటు చేయాలి.

– రాజేందర్, కాంట్రాక్టు కార్మికుడు

కష్టాన్ని దోచుకుంటున్నారు..



మణుగూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. కనీస వేతనాలు అమలు చేయకుండా వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. ప్రభుత్వం పెంచిన వేతనాలు వెంటనే అమలు చేస్తూ వారిని ఆదుకోవాలి. మణుగూరు మున్సిపాలిటీలో కనీస వేతన చట్టాలు అమలు చేయాలి.

– పీర్నాకి నవీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మణుగూరు

మట్టి రోడ్లకు మహర్దశ

- సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.36 లక్షలు మంజూరు
- 8 రహదార్ల నిర్మాణాలకు లైన్ క్లియర్
- ఇప్పటికే ప్రారంభమైన నిర్మాణ పనులు

చర్ల: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుంది. రోడ్లు సరిగా లేక ఏటా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో కనీసం నడక సాగించడం కూడా కష్టంగా ఉండేది. ఈ క్రమంలో మండల కేంద్రంలోని 8 ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు రూ.36 లక్షల రూపాయలు మంజూరయ్యాయి.


చర్లలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్‌శాఖ పర్యవేక్షణలో కొనసాగే ఈ పనులకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. నామినేటెడ్ పద్ధతిలో పనులను చేయించేందుకు పంచాయతీ పాలకవర్గం తీర్మానించగా.. ఐదు చోట్ల రోడ్ల నిర్మాణాల పనులు ప్రారంభమయ్యాయి. సీసీ రోడ్లుగా మారనున్న ప్రాంతాల్లో జయంతికాలనీ, విజయకాలనీ, సాయినగర్ తోపాటు మరికొన్ని ప్రాంతాలు ఉన్నాయి.

మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తుండడంపై ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పనులు పదికాలాల పాటు మన్నే ఉండే విధంగా.. నాణ్యతగా ప్రమాణాలు పాటించేలా అధికారులు పనులను పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

అవకాశం ఉన్నంత వరకు అభివృద్ధి



గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీలలో అవకాశం ఉన్నంత వరకు అభివృద్ధి చేస్తా. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రుల కోటా నుంచి నిధుల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నా. పంచాయతీ పరిదిలో మళ్లీ ఎన్నికలు వచ్చేలోగా అన్నీ రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నా. ప్రస్తుతం కొనసాగుతున్న అన్ని అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండేలా పర్యవేక్షిస్తూ ఇంజనీరింగ్ అధికారులను కూడా నిత్యం పరిశీలించాలని కోరుతున్నా.

– కాపుల కృష్ణార్జునరావు, సర్పంచ్

చర్యలు తీసుకోవాలి


సీఐకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మణుగూరుటౌన్: మణుగూరు పట్టణంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు శుక్రవారం మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామానుజవరం, మణుగూరు అంబేడ్కర్ సెంటర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేయాలని మణుగూరు సీఐ ముత్యం రమేష్‌ను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ములకలపల్లి: కల్యాణలక్ష్మి పథకంలో మంజూరైన చెక్కులను తహసీల్దార్ శేషగిరిరావు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొదుమూరి పుల్లారావుతో కలిసి 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ములకలపల్లి, కమలాపురం, రాచన్నగూడెం సర్పంచ్‌లు బీబినేని వీరభద్రం, గొల్ల పెంటయ్య, కొర్సా గణపతి, ఆరై వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న తహసీల్దార్, ప్రజాప్రతినిధులు

పరీక్ష కేంద్రం తనిఖీ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షలను జిల్లా పరీక్షల కమిటీ బృందం సభ్యులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ బృందంలో డీఐఈఓ సులోచనరాణి, యూసఫ్, సుధాకర్‌రెడ్డిలు ఉన్నారు. పరీక్ష జరుగుతున్న విధానాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్సై రవికుమార్‌లు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇంటర్ పరీక్షలకు 273 మంది హాజరు కావాల్సి ఉండగా.. 23 మంది గైర్హాజరై 250 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఎల్.వెంకటేశ్వర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ కె.గరుడాచలంలు తెలిపారు.

తడిసిన పంట పరిశీలన

మణుగూరుటౌన్: మండలంలోని సాంబాయిగూడెం, కొండాయిగూడెం గ్రామాల్లో అకాల వర్షం కారణంగా తడిసిన మిర్చి పంటను మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతుల అధైర్యపడొద్దన్నారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. మిర్చి పంట తడిసిన విషయాన్ని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. వ్యవసాయ అధికారులు నష్టం వాటిల్లిన మిర్చి పంట వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముత్యం బాబు, నాయకులు వెంకట్‌రెడ్డి, చందర్ రావు, సతీష్, సీతారాములు పాల్గొన్నారు.


తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నరసింహారావు

ప్రవీణ్‌కుమార్ అరెస్ట్‌పై నిరసన


బూర్గంపాడు: ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఎస్పీ నాయకులు

బూర్గంపాడు: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం బూర్గంపాడు ప్రధానకూడలిలో ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా కార్యదర్శి కేవీ రమణ మాట్లాడుతూ.. టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షను రద్దుచేయాలని నిరాహారదీక్ష చేస్తున్న డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేయటం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలలో లీకులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో ప్రవీణ్‌కుమార్ చేపట్టిన ఆమరణదీక్షను భగ్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పలక ఆదిలక్ష్మి, కేసుపాక సాధన, కొప్పుల రాంబాబు, బొల్లు సంపత్, కేసుపాక రవివర్మ, గొడ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా అమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయడాన్ని బహుజన సమాజ్ పార్టీ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ములకపాడు గ్రామంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కోకన్వీనర్ కంచర్ల సింహాద్రి మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.యస్ ప్రవీణ్ కుమార్ ఆమరణ నిరహార దీక్ష ఫలితంగానే గ్రూప్-1 ప్రిలిమ్స్ డీఏఓ, ఏఈ పరీక్షలు రద్దు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పాడుతూరి రవీంద్ర ప్రసాద్, మండల కార్యదర్శి, నాయకులు కనుకు సాగర్, సోందె వెంకటరాజు, భూపతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

స్పీడ్ బ్రేకర్లు ఏవి..?



మండల పరిధిలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట మణుగూరు-భద్రాచలం ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. పాఠశాల ప్రధాన ద్వారం రహదారి వెంబడి ఉండటంతో పాఠశాలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు, బయటకి వెళ్లేటప్పుడు రహదారి మీదుగా వెళ్లాల్సి రావడంతో వాహనాల వల్ల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పాఠశాల ఎదుట రహదారిపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

– అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: రాంబాబు, ఆర్అండ్‌బీ ఏఈ
ఫోన్ నంబర్: 9441435367

అకాల వర్షం.. తీరని నష్టం


గుండాల: నేలకు వాలిపోయిన మొక్కజొన్న పంట

చర్ల: తుఫాను ప్రభావంతో చర్ల మండలంలో కురిసిన అకాల వర్షం మండల రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది. మిర్చి కాయలు కోసి కళ్లాల్లో ఆరబోయగా, కొన్ని చోట్ల రైతులు టార్పాలిన్లతో మిర్చి పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. మరి కొన్ని చోట్ల టార్పాలిన్లు దొరుకక రైతులు అలాగే వదిలేయడంతో ఆ కాయలు తడిసి ముద్దయ్యాయి. మండలంలోని లింగాపురం, కొత్తపల్లి, గొంపల్లి, గుంపెన్నగూడెం, తేగడ, కుదునూరు, ఆర్ కొత్తగూడెం, కుదునూరు తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి కనిపించింది. అయితే శుక్రవారం మధ్యాహ్నం తరువాత వాన ఎలిచి, ఎండ రావడంతో పంటలపై టార్పాలిన్లను తొలగించారు. దీంతో రైతులకు కొంత మేర నష్టం తప్పినట్లైంది. వర్షాలు మరలా మొదలైతే ఆరబోసిన మిర్చికి బూజు పట్టి, రంగు మారే ప్రమాదం ఉంది.

కరకగూడెం: తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షం మిర్చి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పగలనక రాత్రనక కష్టపడి సాగు చేసి చేతికొచ్చిన పంట ఇలా అకాల వర్షాలకు తడిసిముద్దవ్వడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మిర్చి రైతు కళ్లాల్లో నిల్వ ఉంచిన మిర్చి తడిసిపోవడంతో వాటిని టార్పాలిన్లతో కాపాడుకునేందుకు ప్రయత్నం చేశారు. అలాగే లోతట్టు ప్రంతాల్లోకి నీరు రావడంతో పలువురి ఇళ్లలోకి వరద నీరు చేరాయి. అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

దుమ్ముగూడెం: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతన్నలకు తీవ్ర ఆవేదన మిగిలించింది. వాతావరణ మార్పుల వల్ల గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం వరకు కురిసిన వర్షం వల్ల కల్లాల్లో ఆరబెట్టిన మిరప పంట తడిచిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని కె.రేగుబల్లి, నర్సాపురం, సీతారాంపురం, తూరుబాక, లక్ష్మీనగరం గ్రామాల్లో వేసిన మిర్చి పంట తడిచిపోవడంతో రైతులు వాటిని ఆరబెట్టేపనిలో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని వాతవరణ శాఖ అధికారులు తెలపడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

ఓ మోస్తరు వర్షం..

అన్నపురెడ్డిపల్లి: మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 8.2 మి.మీ వర్షపాతం నమోదైంది. తుఫాన్ ప్రభావంతో వర్షం కురవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. కోత కోసిన మిర్చి తడవకుండా ఉండేందుకు రైతులు అవస్థలు పడ్డారు. మామిడి, మొక్కజొన్న పంటల రైతులు భయాందోళన చెందారు.

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో శుక్రవారం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. గురువారం కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో పంట చేలు నేలకు వాలాయి. గురువారం రాత్రి, శుక్రవారం మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. ఈ వానతో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, పత్తి చేనుల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని నష్టపోయిన రైతులు వేడుకుంటున్నారు. మండలంలోని వాగులు సైతం స్వల్పంగా పారాయి.

కాలనీల్లో రోడ్లు బురదమయం

భద్రాచలంటౌన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని పలు కాలనీలలోని రోడ్లు బురదమయం అయ్యాయి. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి వరద నీరు రోడ్లపై నిలిచిపోయింది. చుట్టుపక్కల నుంచి వ్యర్థాలు వరద నీటితో వచ్చి రోడ్లపై నిలిచిపోయాయి. దీంతో కాలనీల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటి పలు కాలనీలలో సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేకపోడంతో చిన్న వర్షం పడిన వరద నీరు లోతట్టు ప్రాంతాల కాలనీలలోని రోడ్లపై చేరింది. సంబంధిత అధికారులు స్పందించి కాలనీలలో సరైన డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


కరకగూడెం: తడిసిన మిర్చిని చూపుతున్న రైతు


భద్రాచలంటౌన్: పట్టణంలోని ఓ కాలనీలో రోడ్డుపై నిలిచిన వరద నీరు


చర్ల: తడిసిన మిర్చిని ఆరబెట్టిన రైతులు